# చిరిగిన బట్టలు, నలగని దుస్తులు

మధు చాలా హడావుడిగా ఉన్నాడు. అతనికి చిరాకు హెచ్చయిపోతోంది. తొమ్మిదిన్నరయింది; ఇంకా బట్టలు వేసుకోవడం కాలేదు. ఆనాడు ఏ బట్టలు తొడుక్కోవాలో అతనికో పట్టాన తోచలేదు. పెట్టెలోని బట్టలన్నీ కెలికివేశాడు. పక్కనే కూర్చున్న స్నేహితుణ్ణి సలహా అడగటం - అతను చెప్పిన జత నచ్చక పోవడం; మరి తనకు తోచిందికూడా తన హృదయంలో ఎవరో తోసిపుచ్చడం - ఇదంతా చూస్తూ వుంటే మధుకు పిచ్చెక్కినట్లుగా ఉంది. అతను జన్మలో ఇలాంటి ఇబ్బంది పడలేదు. కాని ఏదైతే తనకు మొదట నచ్చలేదనుకున్నాడో, దాన్నే అదేమిటో గాని, పాపం చివరికి ఉపయోగించాలని ఉపక్రమించాడు.

అప్పుడే బయటనుంచి, 'బాబూ' అని ఓ బిచ్చగాడు దీనంగా చెయ్యి చాచాడు.

మధు అటు చూడకుండానే మధ్య వీడిగొడవేమిటని లోలోన గొణుక్కుంటూ, "వెళ్ళు వెళ్ళు" అన్నాడు. బిచ్చగాడు "ఒక కానీ ఎయ్యండి బాబూ" అని అరిచాడు.

మధు బనియను వేసుకుంటూ "కానీ లేదు గీనీ లేదు వెళ్ళు" అని, ఆ పదాలు నొక్కుతూ, అందుకు తగ్గట్టుగా చెయ్యి ఆడించాడు ఎంతో విసుగుదలతో. అతని దృష్టి అంతా ఆ బట్టలు నలగకుండా ఎట్లా తొడుగుకోవాలో అన్న విషయంపై కేంద్రీకరించబడి ఎంతో పనితనాన్ని ప్రదర్శించుకుంటూంది. ఈ కష్టాన్ని గుర్తించలేని ముష్టివాడు "పిల్లలతో మలమల మాడిపోతున్నాం బాబూ" అన్నాడు.

మధుకు కోపంతో కవిత్వం కూడా తన్నుకొచ్చింది. అతను, "ఇక్కడ మేమేమీ కిలకిల కులుకుతూ కూర్చోడం లేదు. దయచెయ్యి." అన్నాడు. అలా అని తను చెప్పినదాంట్లో ఏదో నవ్వుకోవడానికి వీలైన విషయం ఉందని అనుకున్నాడో ఏమో, స్నేహితుని వైపుచూసి తన కళ్ళల్లో కాస్త చిరునవ్వు మెరిపించాడు. అప్పటికి ఆ స్నేహితుడు ఏవో ఊహల్లో మునిగినవాడై, మధువైపు ఓపిచ్చి చూపు ప్రసరించి

ఊరుకున్నాడు. మధుకాస్త నిరుత్సాహపడ్డాడు. కాని దుస్తులు ధరించడం విషయంలో మాత్రం కించిత్తూ అజాగ్రత్తపడలేదు. బిచ్చగాడు అంతటితో మధును వదలి వెళ్ళనూలేదు. వాడు చాలా పొడవుగా ఉన్నాడు. కాళ్ళు ఎంతో నిడివిగా ఉన్నాయి.చేతిలో పొట్టికర్ర, నడుం కొద్దిగా వంగి ఉంది. నెత్తిమీద ఓ పాతిక అంగుళం ఎత్తున తెల్లని జుత్తు ఉంది. గెడ్డం అంతకు తక్కువగానే ఉంది కాని అది అక్కడక్కడ అసంపూర్తిగా మొలిచి మొగం చాలా వికారంగాఉంది. మొత్తంమీద అతని మొగం రైలుగట్టుకి ఇరుపక్కలా నిప్పురవ్వలు పడి, అక్కడ ఉన్న గడ్డి కొద్ది కొద్దిగా తగులబడి,కొంచెం పచ్చగా కొంచెం నల్లగా కాలిఆరిన పేడులా వికృతంగా ఉంది. వాడి కళ్ళు లోతుకు దించుకొనిపోయి గాజుకన్నులు రెండు అక్కడ అతికించినట్లుగా ఉన్నాయి. వాడిముందు ఒక చిన్న కుర్రాడు వాడి రెండవచేతిని పుచ్చుకొని నిలచి ఉన్నాడు. వాడి వెనక ఒక పెద్ద కుర్రవాడు తండ్రి పైమీదఉన్న నల్లని చింకి మురికిగుడ్డను ఒక చేత్తో పుచ్చుకొని రెండవ చేత్తో గిన్నె పట్టుకుని ఎటో చూస్తున్నాడు. ముందున్న పసివాని జుట్టు రాగిబొచ్చువలె ఉంది. వాడి బుగ్గలమీద ఏడుపు కన్నీళ్ళ మరకలున్నాయి. వాడి కొక గోచీ ఉంది. వాడి ఒళ్ళంతా దుమ్ముకొట్టుకొని ఉంది. వెనకవున్న వాడి నెత్తిమీద పుట్టెడు తల ఉంది. అది అట్టలుకట్టి ఉంది. వాడు చినిగిపోయిన పెద్ద మిలటరీ చొక్కా తొడుగుకొని ఉన్నాడు.

బిచ్చగాడు, "ఒక్క కానీ ఇప్పించండి బాబూ...దరమ పెబువులు" అన్నాడు.

మధుకు ఎక్కడలేని కోపమూ విసురుగా వచ్చింది. అట్లా రావడానికి కారణం అతని పేంటు ఒకచోట కొద్దిగా మడతబడింది.

"నీక్కాదురా...వెళ్ళమంటూంటె..." అని ఒక్క అరుపు అరచి మధు 'వెధవ... ఇందాకటినుంచి చెప్తున్నా కదలడు చూడు!' అని స్నేహితునివైపు చూశాడు. ఈ మాట విన్న ఆ మిత్రుడు ఓ నవ్వునవ్వి ఊరుకున్నాడు. ఈ నవ్వులో ఏముున్నదో మరి అది ఏ అర్థాన్ని మధుకు అందించిందో కాని, మధు విసురుగా, "వెళ్ళు ఇక్కడ నుంచి" అని విపరీతంగా గద్దించాడు బిచ్చగాణ్ణి. బిచ్చగాడు అంతటితో వెనకంజవేయలేదు. ఇంకా అతను ఆశ విడనాడలేదు. ప్రభువులు వాడ్ని వదిలించుకోవడానికి విసిగిపారేసిన కానీ అయినా ఆ కానీలో విసుగుదలఏముంటుంది? సరిగదా అది హాయిగా మారుతుంది. అంచేత అతను కోపగించి పారేసినా, పది తిట్టి పారేసినా ఎలా చేసినా మరేం ఫరవాలేదు. ఎలా పారేసినా కానీ కానీయే!

అందుకనే బిచ్చగాడు, "కాత్త కనికరించండి బాబూ" అన్నాడు చాలా జాలిగా.

ఇహ మధు కోపాన్ని ఆపుకోలేకపోయాడు. "ఒకసారి చెప్తే చాలదురా...ఫో... ఇక్కడనుంచి ... ఊ వెళ్ళు ..." అన్నాడు కళ్ళెరజేసి. బిచ్చగాడు, ఒక కానీ ఎయ్యి బాబూ... పిల్లలతో ... అని ఇంకా ఏదో అనబోతూవుంటే 'వెధవా ... నీకు కాదురా చెప్పేది." అని మధు ఆకాశం ఊడిపడేట్టుగా అరిచాడు. ఇక బిచ్చగాడు మరి లాభం లేదనుకొని అక్కడనుంచి కదలిపోతూ, "ఈ బాబేమి ఇత్తాడు లేరా... పద పద,,, ఈ ఏసాల బాబులికి కోపాలు జాత్తి" అన్నాడు. అన్న తరువాత ఇంకా ఏదో తిడుతూన్నట్టుగానే వినిపించింది మధుకి. మధుకి బిచ్చగాని వెనకాలే వెళ్ళి వాణ్ణి చెడతన్నాలనిపించింది. కాని అతణ్ణి ఏ సభ్యతా శక్తి ఆపిందో తెలియదు; మిత్రునివైపు చూసి, "చూశావా వాడెలా తిడుతున్నాడో ... పెడితే పెళ్ళి, పెట్టకపోతే చావూ కోరుతారు ఈ వెధవలు... అడిగిన వాళ్ళందరికీ మనం ఎక్కడనుంచి తెచ్చి ఇయ్యగలం? ఇవ్వకపోతే వీళ్ళ తిట్లు పడాలన్నమాట! నీచపు వెధవ. వెధవన్నర వెధవ!" అని తల దువ్వుకోవడం మరొకసారి పూర్తిచేసి అద్దంలో ఇంకొకసారి ముస్తాబంతా సరిచూసుకొని, "పదరాపోదాం... టైమయిపోయింది. ఈ పాటికే ఆ కమీషనరు వచ్చేస్తా డనుకుంటాను. ఎంతదూరంలే. సైకిళ్ళమీద పోతాంగా." అంటూ సైకిలుమీద అతిజాగ్రత్తగా కూర్చుని సున్నితంగా దాన్ని తొక్కుతూ, మధు స్నేహితునితో బయలుదేరాడు. తోవలో మధు మిత్రునితో "ఆ కమీషనరు ఓ పట్టాన ఇస్తానన్నా డనుకున్నావేమిటి? ఎన్ని రికమండేషన్లు చేయించవలసి వచ్చింది! మొత్తంమీద ఒప్పుకున్నాడనుకో. ఇంక ఇవ్వాల్టితో మన నిరుద్యోగం పీడ మననుంచి దౌడు తియ్యవలసిందే! ఇంక మా నాన్న గొడవ సన్నగిల్ల కేమౌతుంది? అప్పుడే మొన్న మానాన్న ఏమన్నాడో తెలుసా? ఎవరో ఈ ఉద్యోగం సంగతి తెలిసి పిల్లనిస్తామని దగ్గరకు చేరారట. నేను 'ఊ' అంటే ఆ గుదిబండ మనకు తగిలించేసేవారే. నేను మాత్రం అందుకొప్పుకోలేదు. అసలు మనం ఒక సంవత్సరంపాటైనా ఈ ఉద్యోగం మజా అనుభవించకపోతే ఎలారా... ఏమంటావ్? వెధవ ఆ కిళ్ళీ కొట్టుగాడి కెంత పొగరో.. జీతం రాగానే వాడి బాకీ తీర్చేసి, ఖాతా ఇంకొకడి దగ్గరకు మార్చెయ్యాలి. ఈ ఉద్యోగం వచ్చిందని తెలిసేక వాడిక ఈబాకీ అడగటం మానేస్తాడనుకుంటాను. అయినా సరే వాడిదగ్గర ఇహ ఏమీ కొనగూడదు. మొన్న పదిమందిలో ఎంత ఖచ్చితంగా నిలేసి అడిగాడు! ఆ మాత్రం తీర్చకుండా ఎగేస్తామనుకున్నాడు కాబోలు!"

ఇంతలో మునిసిపల్ ఆఫీసు వచ్చేసింది. స్నేహితులిద్దరూ సైకిళ్ళు దిగారు. మధు కమీషనరుగారి గదివైపు నడక సాగించాడు. స్నేహితుడు బైట సైకిళ్ళవద్ద నిలచి ఎటో

చూస్తున్నాడు.

కమీషనరుగారి గదివైపుగా వస్తున్న మధుని - విలువైన అందాల దుస్తుల్లో మెరసిపోతూన్న మధుని - బంట్రోతు నాగయ్య అడ్డుపెట్టలేకపోయాడు. మధు అతనివైపు చూడకుండానే తిన్నగా కమీషనరుగారి గదిలో ప్రవేశించాడు. మధు ఆ గదిలో అడుగుపెడుతూనే 'గుడ్‌మార్నింగ్ సర్' అన్నాడు. కమీషనరు మధుని చూడగానే మొగం చిట్లించి, ఎవరు మీరన్నట్లు చూశాడు. మధు, "ప్రెసిడెంటుగారు పంపించారండి... మీతో చెప్పారటకదండీ" అంటూ చేతిలోని అప్లికేషను ఇచ్చాడు. కమీషనరు గారు "సారీ... ఆ పోస్టులో ఇప్పుడే ఒకర్ని నియమించడమైంది. మళ్ళీ ఖాళీలు వచ్చినప్పుడు పిలుస్తాలెండి" అన్నాడు.

ఈ మాటతో మధు మొగం ఒక్కసారిగా పాలిపోయింది. అతనికి ఏమి మాట్లాడాలో తోచలేదు. కాని, "మీరు కొంచెం అనుగ్రహించాలండి... చాలా పేదవాణ్ణి. మీరు దయచూడకపోతే..." అన్నాడు. కమీషనరుగారు విసుగుతో, "ఇక్కడి పరిస్థితులు మీకు అర్థంకావు. ఇక మీరు వెళ్ళండి" అన్నాడు. మధు కాళ్ళు విపరీతంగా వణికిపోతున్నాయి. అతని గుండె విపరీతంగా కొట్టుకోవడం మొదలుపెట్టింది. "నేను చాలా పేదవాణ్ణండీ... మీరు... తప్పక........" అని ఇంకా ఏదో అనబోతూన్న మధుని వినిపించుకోకుండానే కమీషనరు, "ఇహ మీరు వెళ్ళండి" అన్నాడు. అంటూ ఆయన ఏవో కాగితాలలో తల దూర్చాడు. మధు పెదవి అదేమిటో అదోలా వణికింది. అతని నాలుక ఏదో చెప్పబోయి నోటిలోనే అర్థరహితంగా కదలి ఊరుకుంది. అతని నుదురు చెమర్చింది. అతని కళ్ళముందు కిళ్ళీకొట్టువాడు 'హిహిహి' అని ఏదో అంటూన్నట్టు ఓ సినిమాబొమ్మ నిలచింది.మధు మెల్లగా, "సార్" అన్నాడు కమీషనరుగారి ముందుకు దీనంగా వంగి. కమీషనరుగారు ఇదంతా గొడవగా ఉందే అనుకుంటూ "నాగయ్యా వీరిని బయిటకు తీసుకెళ్ళు" అన్నారు. టేబిలుమీద ఉన్న గంట మ్రోగించి, తల ఎత్తకుండానే.

మధు మొగం పాపం వికృతంగా మారిపోయింది. అతనికి తెలియకుండానే పళ్ళు పటపటలాడాయి. బయటకు స్నేహితుడున్న చోటికి ఎలా నడచివచ్చాడో చెప్పలేం. ఆ మిత్రుని దగ్గరకు వచ్చేప్పటికి అతని నోటినుండి ఎన్ని రకాల తిట్లు బయటపడ్డాయో అంతకన్నా చెప్పలేం. పది నిమిషాలవరకూ స్నేహితునితో ఏ సంగతీ మాట్లాడలేకపోయాడు. అతికష్టంమీద జరిగిన సంగతి అనేక బూతుల కలయికతో అతని నోటినుంచి బయటపడేప్పటికి చాలాటైము తీసుకుంది.

ఇదంతా విని ఆ స్నేహితుడు మధు కష్టాన్ని ఏమాత్రం గుర్తించకుండా పకపకా నవ్వడం మొదలుపెట్టాడు. మధు, మిత్రునివైపు వింతగా చూసి, "ఎందుకురా నవ్వుతావు?" అన్నాడు. అతను కాస్సేపు జవాబు చెప్పలేదు కాని చివరికి "అబ్బే ఏమీ లేదు... చిరిగిన బట్టలకు, నలగని దుస్తులకు తేడా ఏమిటా అని ఆలోచిస్తున్నాను" అన్నాడు.

మధుకు ఓ పట్టాన అర్థం కాలేదు. "అంటే?" అన్నాడు. దానికా మిత్రుడు, "అబ్బే ఏమీలేదు. ఆ బిచ్చగానికీ, బియ్యే చదివిన నీకూ దుస్తుల్లో తప్ప తేడాఎందులో ఉన్నదా అని. చదువులేని ఆ ముసలి బిచ్చగానికన్నా హీనంగా దిగజారిపోయిన నీ సంస్కారానికి ఏడవాలో నవ్వాలో బోధపడటంలేదు. ఆ తిట్లవల్ల నీకు ఒరిగేదేమిటో నాకంతకన్నా అవగాహన కావడంలేదు" అన్నాడు.

మిత్రుడు అలా అనేసరికి మధు నిశ్చేష్టుడై అలాగే శూన్యంలోకి చూస్తూ ఉండిపోయాడు!

(ఆంధ్రపత్రిక, 29.7.1953)